
సాక్షి
నిజామాబాద్
మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



తొలి గంట.. మోసానికి అడ్డుకట్ట
సైబర్ మోసగాళ్ల వలలో పడకుండా పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. మోసం జరిగిన గంటలోపు ఫిర్యాదు చేయాలంటున్నారు.
- 8లో ▸



'సాగర్' 5 గేట్ల ఎత్తివేత
ఎగువ ప్రాంతాల్లో వర్షాల తో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 32,820 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని అధికారులు తెలిపారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /20.4
వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేషన్‌కార్డుల మంజూరుకు బ్రేక్

సుభాష్‌నగర్: జిల్లాలో రేషన్‌కార్డుల మంజూరును తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో) అరవింద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని దీంతో మంజూరు ప్రక్రియ చేపట్టడంలేదన్నారు. అదేసమయంలో అర్హులు మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని , కోడ్ ముగిసిన తర్వాత మంజూరు ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

జిల్లాకు ఆరుగురు ఏవోలు

డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పని చేస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏవోలుగా ఇటీవల పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా ఇతర జిల్లాల నుంచి ఆరుగురు ఏవోగా పదోన్నతులు పొంది జిల్లాకు వచ్చారు. చందూర్ ఏవోగా కిరణ్, మోస్రాకు వెంకటేశ్, డిచ్‌పల్లికి ఆంజనేయులు, వేల్పూర్ ఏవోగా రాజుకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే శ్రీనివాస్, రమేశ్‌లకు జిల్లా కార్యాలయంలో టెక్నికల్ ఏవోలుగా పోస్టింగ్ ఇవ్వగా విధుల్లో చేరారు. జిల్లాలోని వేల్పూర్ ఏఈవోగా పని చేసిన తిరుమలకు ఏవోగా పదోన్నతి కల్పించి ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు బదిలీ చేశారు.

మద్యం షాపులకు 35 దరఖాస్తులు

ఖలీల్‌వాడి : మద్యం షాపులకు సోమవారం 35 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందన్నారు. నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 షాపులకు 18 దరఖాస్తులు, బోధన్‌లో నాలుగు మద్యం షాపులకు ఐదు, ఆర్మూర్‌లో నాలుగు షాపులకు ఐదు, భీంగల్‌లో మూడు షాపులకు నాలుగు, మోర్తాడ్‌లో రెండు షాపులకు 3 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలో మొత్తం 102 మద్యం షాపులు ఉన్నాయన్నారు.

పోలీస్ ప్రజావాణికి 18 ఫిర్యాదులు



ఖలీల్‌వాడి: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సీపీ సాయిచైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు చెందిన ఎస్సైలు, సీఐలకు ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందన్నారు. బాధితులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన రెవెన్యూ అధికారి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారిగా సీహెచ్ మధుమోహన్ నియమితులయ్యారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జెడ్పీ పీఠం మాదే!

పక్కా ప్రణాళికతో స్థానిక ఎన్నికలకు వెళ్తున్నాం

- ఉనికి కోసమే బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పోరాటం
- కవిత ఎపిసోడ్ బీఆర్‌ఎస్‌కే నష్టం
- బీజేపీ బీసీ బిడ్డలకు ద్రోహం చేస్తోంది
- 'సాక్షి' ముఖాముఖిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి



ముఖాముఖి

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కచ్చితమైన వ్యూహంతో ముందుకెళ్తున్నామని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2019 ఫిబ్రవరి 7 నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ముఖాముఖిలో పలు అంశాలపై మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఎంపీపీలు, పంచాయతీలు స్వీప్ చేస్తాం..

జిల్లా ప్రజాపరిషత్ పీఠాన్ని గెలుచుకునేందుకు కచ్చితమైన వ్యూహంతో ముందుకు వెళుతున్నాం. అత్యధిక ఎంపీపీలు, గ్రామ పంచాయతీలు గెలుచుకుంటాం. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నాం. మీనాక్షీ నటరాజన్ ఆధ్వర్యంలో పార్టీలోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ యువతకు ప్రాధాన్యం ఇచ్చేందుకు నిర్ణయం జరిగింది.

జిల్లాలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం పోరాటం చేయాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమం, అభివృద్ధిలో రాజీలేకుండా ముందుకెళుతున్నాం. చిత్తశుద్ధితో ప్రజాసమస్యల పరిష్కారం చేస్తున్నాం. లోలోపల ఒక్కటిగా ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని బదనాం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటన్నింటినీ తిప్పికొట్టేందుకు కార్యకర్తలకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ముఖ్య నాయకులతో కలిసి దిశానిర్దేశం చేస్తున్నాం. ప్రజలతో మమేకమై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరాం.

✤ కవిత ఎపిసోడ్‌తో బీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయిలో నష్టం కలుగుతోంది. కవిత ప్రభావం బీఆర్‌ఎస్‌పైనే ఉంటోంది. పదేళ్లు తండ్రి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కవిత జిల్లాకు చేసింది శూన్యం. చెప్పుకునేందుకు ఒక్కటీ లేదు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు..

బీసీ బిడ్డలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదుర్కొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. బీజేపీ పార్లమెంటులో, గవర్నర్ వద్ద ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టి బీసీలకు ద్రోహం చేస్తోంది. బీసీలను బాగుచేసే ఆలోచన బీజేపీకి లేదు. అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు షరతులు అంటున్నారు.. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి ముస్లింల వంక చెబుతున్నారు. ఈడబ్ల్యూఎస్‌లో ముస్లింలు ఉంటారు, బీసీ బిల్లులో వద్దంటున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిని పార్టీ నిర్ణయిస్తుంది

జెడ్పీ పీఠంపై ఎవరిని కూర్చోబెట్టాలనే విషయాన్ని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు కలిసి నిర్ణయిస్తారు. పనిచేసిన వారికి పార్టీ తగిన న్యాయం చేస్తుంది. ఇప్పటికే జిల్లా నుంచి ఐదుగురిని కార్పొరేషన్ చైర్మన్లుగా చేసింది. మార్కెట్ కమిటీ, నుడా పదవులను భర్తీ చేసింది. జెడ్పీతో పాటు ఎంపీపీలు అన్నీ గెలుచుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రేషన్ కార్డులు, సన్నధాన్యం బోనస్, రుణమాఫీ, భూభారతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సిలిండర్, ఉచిత బస్సు పథకాలు అమలు చేస్తున్నాం. గురుకులాల్లో, వసతి గృహాల్లో డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచాం. 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఉద్యోగులకు ప్రతి నెల ఫస్ట్ తారీఖున జీతాలు వస్తున్నాయి.

జిల్లాకు కో ఆపరేటివ్ శిక్షణ కేంద్రం

ఇప్పటి వరకు హైదరాబాద్, వరంగల్‌లలో మాత్రమే కోఆపరేటివ్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా మహబూబ్‌నగర్, ఖమ్మంలతో పాటు నిజామాబాద్‌లోనూ ఏర్పాటు చేయనున్నాం. ఇది మంచి అచీవ్‌మెంట్. ఈ శిక్షణ కేంద్రాన్ని ఆర్మూర్‌లో త్వరలో ప్రారంభించనున్నాం.

మా హయాంలోనే తెయూ..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తెలంగాణ వర్సిటీ, మెడికల్ కళాశాల వచ్చాయి. ఇప్పుడు ఇంజినీరింగ్ కళాశాల ఇచ్చిందీ కాంగ్రెస్ ప్రభుత్వమే. బీఆర్‌ఎస్ హయాంలో తెయూలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. ఇన్‌చార్జుల పాలనతో తెయూ నడిచింది. మా ప్రభుత్వం వచ్చాక రెగ్యులర్ వీసీని నియమించి తెయూ పాలనను పూర్తిగా సరిచేశాం. బీఆర్‌ఎస్ హయాంలో విధ్వంసమైన వ్యవస్థలను పునర్నిర్మాణం చేస్తున్నాం. ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నాం. బోధన్ నియోజకవర్గంలో మూడు విద్యుత్ సబ్ స్టేషన్లు, బాల్కొండలో రెండు మంజూరు అయ్యాయి.

మరోసారి డీసీసీ పీఠం ఆశించడం లేదు

జిల్లా కాంగ్రెస్ పీఠాన్ని మరోసారి ఆశించడం లేదు. కొత్త రక్తానికి అవకాశం ఇచ్చేందుకు రేసు నుంచి తప్పుకున్నాను. 14 నెలల క్రితం రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియామకమైనప్పటి నుంచి డీసీసీ పీఠాన్ని మరొకరికి అప్పగించాలని పార్టీ నాయకత్వాన్ని నేను కోరుతూ వస్తున్నాను.

నగరానికి చెందిన సుమలత 11.07. 2025 నాడు థైరాయిడ్ సమస్యతో ఖలీల్‌వాడీలో ఓ ఆస్పత్రి ఏర్పాటు చేసిన బ్రాంచి ఆస్పత్రికి వెళ్లారు. కన్సల్టేషన్ ఫీజు రూ. 600 చెల్లించారు. అయితే ఇతర రోగికి సంబంధించిన ట్రీట్‌మెంట్ మందులు రాసి ఫైల్ తన చేతిలో పెట్టారు. బాధితురాలు వైద్యుడినే కలవలేదు.. చూపించుకోలేదు.. అయినా అవే మందులు వాడాలని సిబ్బంది సలహా ఇచ్చారు. ఆమె భర్త పలుమార్లు ప్రశ్నించడంతో పాటు ఇంత పెద్ద ఆస్పత్రి పేరు పెట్టుకొని ఒకరి రోగంపై మరొకరి మందులు రాయడంపై మండిపడ్డారు. అనంతరం నేరుగా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై రాతపూర్వకంగా విన్నవించారు. అయినా ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి జవాబు లేదు.

అనుమతిలేని ఆస్పత్రులు

- దర్జాగా ఫీజుల వసూలు
- ఫిర్యాదులను పట్టించుకోని వైద్యశాఖ
- నోటీసులతో సరిపెడుతున్న వైనం



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. రెండు, మూడు సంవత్సరాల నుంచి కొత్తగా ఏర్పడుతున్న కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు కనీస అనుమతులు ఉండటం లేదు. అయినా, దర్జాగా రోగుల వద్ద ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రధానంగా నగరంలోని ఖలీల్‌వాడీ, ద్వారకా నగర్, ప్రగతినగర్, హైదరాబాద్ రోడ్, కంఠేశ్వర్ రోడ్, బోధన్ రోడ్, వర్ని రోడ్ తదితర ప్రాంతాల్లో సుమారు 400 పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 870 పైగా ఆస్పత్రులకు వైద్యశాఖ అనుమతులు జారీ చేసింది. ఇందులో సుమారు 40 ఆస్పత్రులకు తాత్కాలిక అనుమతులు ఉన్నాయి. పలు ప్రాంతాల్లో మల్టీ, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ తదితర తోక పేర్లతో పదుల సంఖ్యలో ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు.

నోటీసులతో..

ప్రస్తుత కాలంలో ఫిర్యాదు చేయడమే గగనం. అధికారులు మాత్రం ఎవరైనా ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెబుతుంటారు. కానీ, ఫిర్యాదు వస్తే మాత్రం తూతూ మాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు ఆస్పత్రులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా ఫిర్యాదు దారుకు చెప్పడం లేదంటేనే అర్థమవుతోంది. కాగా, వైద్యశాఖలోని కొంతమంది ఉద్యోగులు ముడుపులు అందుకొని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆస్పత్రులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇక్కడ ఓపీ.. రాజధానిలో ట్రీట్‌మెంట్

ప్రైవేట్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా వైద్యారోగ్యశాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మొదట తాత్కాలిక అనుమతి తప్పనిసరి. అయితే జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యారోగ్యశాఖ అనుమతితో సంబంధం లేకుండా సేవలు అందిస్తున్నాయి. రోగుల నుంచి రూ. 400నుంచి రూ.600 పైగా ఫీజులు వసూలు చేసి ఓపీ సేవలందిస్తున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా జిల్లాలో కొత్త సంస్కృతికి తెరలేపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రుల పేరిట జిల్లాలో అక్కడక్కడా బ్రాంచీలను ఏర్పాటు చేశారు. కనీస అనుమతి లేకుండా ఓపీ సేవలు అందించొద్దనే నిబంధనలను తుంగలో తొక్కి ఫీజులు దండుకుంటున్నారు. రోగులను భయపెడుతూ హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నట్లు సమాచారం.

ఎస్సారెస్పీలో 'రూప్ చంద్' చేపలు..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో కొత్తరకం రూప్ చంద్ చేపలు ఎక్కువగా చిక్కుతున్నాయని మత్స్యకారులు తెలిపారు. ప్రాజెక్ట్ చరిత్రలో ఇంత వరకు రూప్‌చంద్ చేపలు లభ్యం కాలేదన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడం వలన ఈ రకం చేపలు మహారాష్ట్ర ప్రాంతం నుంచి కొట్టుకువచ్చాయన్నారు. ఈ చేపలు కిలో రూ.200 ధర పలుకుతాయని తెలిపారు.



ఎస్సారెస్పీలో మత్స్యకారుడికి చిక్కిన రూప్ చంద్ రకం చేప

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్, పాల్గొన్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

అదనపు కలెక్టర్ అంకిత్

బోధన్: ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించి, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ అంకిత్ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పీవోలకు సూచించారు. బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్‌లో సోమవారం డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, మోస్రా, చందూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల పీవోలు 613 మందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు, బాధ్యతలను వివరించారు. ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్స్, ఎంపీడీవోలు శ్రీనివాస్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా అసైన్డ్, భూదాన్, ప్రభుత్వ భూముల సర్వే

- అధికారులకు నిర్దేశించిన కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అంశాలపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని ఆయా మండలాల్లో గల అసైన్డ్ భూములు, భూదాన్, ప్రభుత్వ భూముల సర్వేను పక్కాగా జరిపించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, అన్ని మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా అసైన్డ్, భూదాన్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సర్వేయర్లచే పక్కాగా సర్వే జరిపించి, విస్తీర్ణం, హద్దులు, సర్వే నెంబర్ తదితర సమగ్ర వివరాలను సేకరించాలన్నారు. జియో ట్యాగింగ్ చేయాలని, భూభారతి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామాల వారీగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో సేకరించిన దరఖాస్తుల కంటే ముందు ఆన్లైన్‌లో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అర్జీలను ఆయా మాడ్యుల్స్ లో విభజించిన నేపథ్యంలో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలన్నారు. సాదా బైనామా దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలిస్తూ, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చుకుని పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం గ్రామ పాలన అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీవో రాజేంద్రకుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్ పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



వర్నిలో రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వర్ని: రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం వర్ని తహసీల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతిపై సమీక్ష నిర్వహించారు.

రైతుల సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు జాప్యం చేయడంపై మండిపడ్డారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని అధికారులను ప్రశ్నించారు. 2 నెలలుగా దరఖాస్తులు పెండింగ్లో ఉండడానికి కారణాలు ఏంటని మండిపడ్డారు.

- సమాచారం ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- నేడు జిల్లా కేంద్రంలో సమాచార కమిషన్ సమీక్ష
- పెండింగ్ అప్పీళ్లు, ఫిర్యాదులపై విచారణ

నీరుగారుతున్న స.హ చట్టం

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వం గుప్పిట్లో ఉన్న సమాచారం, సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే హక్కును సామాన్యుడి చేతికి అందించిన ఆయుధం సమాచార హక్కు (సహ) చట్టం. 20 ఏళ్లుగా పౌరులు ఈ చట్టంతో సమస్యలను పరిష్కరించడమే కాకుండా అవినీతిని ఎండగట్టగలిగారు. అయితే జిల్లాలో ప్రస్తుతం చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సహ చట్టం అమలు తీరు అధ్వానంగా మారింది. నేడు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, ఫిర్యాదులపై సమాచార కమిషన్ సమీక్ష చేస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

కప్పదాటు వైఖరి..

సమాచార హక్కు చట్టం సెక్షన్–6 ద్వారా వచ్చిన దరఖాస్తులను సదరు ప్రజా సమాచార అధికారులు పట్టించుకోవడం లేదు. సెక్షన్–7(1) ప్రకారం 30 రోజులలో ఇవ్వాల్సిన సమాచారాన్ని నెలలు గడిచినా ఇవ్వడం లేదు. ప్రతి ఏడాది సహ చట్టంపై శిక్షణ పొందుతున్న అధికారులు నిబంధనలను మాత్రం పాటించడం లేదు.

- జక్రాన్‌పల్లి మండలానికి చెందిన పౌరుడు ఆర్మూర్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో నిజామాబాద్ డివిజన్‌కు చెందిన సమాచారం కోసం దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తును సెక్షన్6(3) ప్రకారం ఐదు రోజుల్లో బదిలీ చేయాలి. కాగా, దరఖాస్తుకు సంబంధించిన వివరాలు తమ దగ్గర లేవని సమాచారం ఇచ్చారు. సహ చట్టం ప్రాథమిక అంశాలు తెలిసినా సదరు పీఐవో తమకేమీ తెలియదనట్టు ప్రవర్తించాడు.



- కామారెడ్డి జిల్లాలో రెవెన్యూ, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ కార్యాలయాలు సమాచారం ఇవ్వడం లేదంటూ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ఒక ప్రజాప్రతినిధికే సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే సామాన్య పౌరుల పరిస్థితి ఏమిటని సహోద్యమకారులు ప్రశ్నిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లాలో చాలా కార్యాలయాలు 4(1)బికి చెందిన 17 అంశాలు స్వచ్ఛందంగా వెల్లడించడం లేదు. జిల్లా విద్యాశాఖ సమాచారం ఇవ్వడంలో అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. సెక్షన్ 8ని సాకుగా చూపి సమాచారం ఇవ్వడంలో సదరు పౌర సమాచార అధికారి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

- బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఒకరు రెండేళ్లలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల వివరాలు కావాలని విద్యాశాఖ అధికారి కార్యాలయానికి దరఖాస్తు చేశారు. దీంతో సెక్షన్(8)జె ప్రకారం వ్యక్తిగత సమాచారం అంటూ దరఖాస్తును తిరస్కరించారు.

- జక్రాన్‌పల్లి మండలానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ అక్రమాలపై వివరాలు కోరగా అధికారుల నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. మొదటి అప్పీల్‌కు వెళ్లగానే తర్వాత సమాచారం కోసం సొమ్ము కట్టాలని సందేశం అందింది.

పెరిగిన అప్పీళ్లు, ఫిర్యాదులు

జిల్లా నుంచి సమాచార కమిషన్‌లో 271 అప్పీళ్లు, 189 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ, విద్యా శాఖ, వైద్యం, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన సహ దరఖాస్తులు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలకోసారి సహ చట్టం అమలుపై నిర్వహించాల్సిన సమీక్షలు గత కొన్ని నెలలుగా జరగడం లేదు.

కమిషన్ సమీక్షలు చేయాలి

ఉమ్మడి జిల్లాలో సహ చట్టం అమలుతీరుపై సమాచార కమిషన్ మూడునెలలకోసారి సమీక్షించాలి. జిల్లా శాఖల్లో సహ చట్టం అమలు తీరు బాగుంది. కానీ, మండల స్థాయిలో నామమాత్రంగా తయారైంది. సెక్షన్ 4(1) 17 అంశాల సమాచారం అన్ని శాఖలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. దరఖాస్తుదారుల కూడా సరైన పద్ధతులు పాటిస్తే అధికారులు సమాచారం ఇవ్వడానికి సులువుగా ఉంటుంది.

– అంకం నరేశ్, కోకన్వీనర్, యూఎఫ్‌ఆర్‌టీఐ

క్లుప్తంగా

బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు లైన్‌ జడ్జిగా వెంకటేశ్‌



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 6 నుంచి 19 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే ప్రపంచ జూనియర్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ పోటీలకు లైన్‌ జడ్జిగా కామారెడ్డి జిల్లాకు చెందిన బల్ల వెంకటేశ్‌ ఎంపికయ్యారు. ఈ మేరకు బాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా ఉత్తర్వులు జారీ చేసినట్లు నిజామాబాద్‌ జిల్లా కార్యదర్శి కేవీ కిరణ్‌ కుమార్‌ తెలిపారు. పోటీల్లో 46 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. న్యాయనిర్ణేతగా ఎంపికైన బల్ల వెంకటేశ్‌ని జిల్లా అధ్యక్షుడు కర్నాటి వాసు అభినందించారు.

కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ఎస్సారెస్పీ నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది. లక్షా 11 వేల 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 26 గేట్ల ద్వారా లక్షా ఒక్క వేయి 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు,మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1090.90(80.05 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన అసిస్టెంట్‌ ఆడిట్‌ ఆఫీసర్‌



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను గ్రూప్‌–1 ఉద్యోగి ఆనంద్‌ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల గ్రూప్‌–1 ఫలితాల్లో నిజామాబాద్‌ జిల్లా ఆడిట్‌ కార్యాలయ అసిస్టెంట్‌ ఆడిట్‌ ఆఫీసర్‌గా ఆనంద్‌ ఉద్యోగం సాధించిన విషయం తెలిసిందే.

డీఎంఎల్‌టీ, డయాలసిస్‌ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్‌ ప్రభుత్వ మెడికల్‌ కళాశాలలో పారామెడికల్‌ కోర్సులైన డీఎంఎల్‌టీ–30 సీట్లు, డయాలసిస్‌–10 సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌ కృష్ణమోహన్‌ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి 28 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతితోపాటు ఇంటర్‌లో బైపీసీ గ్రూప్‌ చదివిన వారు అర్హులని, బైపీసీ చేసిన వారు లేకుంటే ఎంపీసీ చేసిన వారికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు మెడికల్‌ కళాశాల కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

తొలి గంట.. మోసానికి అడ్డుకట్ట

- ప్రజలు సైబర్‌ నేరగాళ్ల బారినపడకుండా పోలీసుల చర్యలు
- టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1930కి కాల్‌ చేస్తే మోసగాళ్ల అకౌంట్లు ఫ్రీజ్‌
- జిల్లాలో మార్చి నుంచి సెప్టెంబర్‌ వరకు 33 కేసులు నమోదు
- మోసగాళ్ల చేతిలో రూ. 4.92 కోట్లు, రికవరీ రూ.87 లక్షలు
- వెల్లడించిన సీపీ సాయిచైతన్య



- నగరంలోని వినాయక్‌నగర్‌కి చెందిన ఓ వ్యక్తి బిజినెస్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ ఫ్రాడ్‌లో రూ.10,51,533 డబ్బులు కోల్పోగా, సైబర్‌ క్రైం పోలీసులు రూ.7,89,979 రికవరీ చేశారు.
- ఆర్మూర్‌ డివిజన్‌కి చెందిన ఓ వ్యక్తిని సైతం సైబర్‌ మోసగాళ్లు మభ్యపెట్టి బిజినెస్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ పేరిట రూ.52,50,297 టోకరా వేశారు. వెంటనే బాధితుడు పోలీసులను సంప్రదించడంతో రూ.27,25,725 రికవరీ చేశారు.
- నగరానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్‌ నేరగాళ్లు డిజిటల్‌ అరెస్ట్‌ పేరిట బెదిరించి రూ.30,81,000 ఆర్‌టీజీఎస్‌ ద్వారా లూటీ చేస్తే, రూ. 20,81,000 సైబర్‌ క్రైమ్‌ పోలీసులు రికవరీ చేశారు.



సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: సైబర్‌ మోసగాళ్ల వలలో పడకుండా జిల్లా ప్రజలను పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. ఆర్థికపరమైన నష్టాలు జరిగిన వెంటనే గ్రహించి గంటలోపు ఫిర్యాదు చేస్తే జాతీయ సైబర్‌ క్రైం పోలీసులు నిందితుల అకౌంట్‌లను ఫ్రీజ్‌ చేసి డబ్బులను రికవరీ చేసే అవకాశం ఉందని అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే సైబర్‌ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్మార్ట్‌ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్‌ చేయొద్దని పోలీస్‌ కమిషనర్‌ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో వివరించారు. జిల్లా పోలీసు సైబర్‌ ఆఫీస్‌కు నెల రోజులలో 8 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఎక్కువగా సోషల్‌ మీడియా, డిజిటల్‌ మార్కెటింగ్‌, ఇన్వెస్ట్‌మెంట్‌, డిజిటల్‌ అరెస్ట్‌ పేరిట మోసాలు జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. సైబర్‌ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే డయల్‌ 1930 నెంబర్‌, లేదా డయల్‌ 100కు ఫోన్‌ చేయాలని, www. cybercrime. gov. in లాగిన్‌ అయి రిపోర్ట్‌ చేయాలని సూచించారు. ప్రతివారం జిల్లా సైబర్‌ క్రైమ్‌ బృందంతో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సైబర్‌ వారియర్లను ఏర్పాటు చేసి సైబర్‌ మోసాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్‌ వరకు 33 సైబర్‌ క్రైం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. బాధితులు రూ.4,92,54,875 నష్టపోగా సైబర్‌క్రైమ్‌ పోలీసులు రూ.87,29,839 రికవరీ చేశారని తెలిపారు. సైబర్‌ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు సైబర్‌క్రైమ్‌ ఏసీపీ వై. వెంకటేశ్వరరావు, సీఐ మహమ్మద్‌ ముఖీద్‌ పాషా, ఎస్సై ప్రవళిక, హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌, కానిస్టేబుళ్లు శ్రీరామ్‌, సురేశ్‌, నాగభూషణం, నరేశ్‌, ప్రవీణ్‌, రాఘవేంద్ర, సుమలత, శృతి, రమ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కౌంటింగ్‌ ఏజెంట్లుగా వీరు అనర్హులు

మీ కోసం...

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): ఎన్నికల ప్రక్రియలో పోలింగ్‌, కౌంటింగ్‌ ఏజెంట్లను అభ్యర్థులు నియమించుకుంటారు. వీరికి రిలీవర్లను సైతం ఏర్పాటు చేసుకోవచ్చు. అందుకోసం ముందుగా దరఖాస్తు చేసుకొని (రిటర్నింగ్‌ అధికారి) నుంచి అనుమతి తీసుకోవాలి. ఇదే సందర్భంలో కొందరు వ్యక్తులను ఏజెంట్లుగా తీసుకునేందుకు అవకాశం ఉండదు.

- స్థానిక ఎన్నికల్లో పదవిలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌, మున్సిపల్‌ చైర్మన్లను పోలింగ్‌, కౌంటింగ్‌ ఏజెంట్లుగా నియమించడానికి వీల్లేదు.
- పదవిలో ఉన్న జడ్పీ చైర్మన్‌, మండల పరిషత్‌ అధ్యక్షుడు, సర్పంచ్‌, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కో–ఆపరేటివ్‌ సంఘాల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ సంస్థల చైర్‌పర్సన్లు, ప్రభుత్వ ప్లీడర్‌, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగిని పోలింగ్‌, కౌంటింగ్‌ ఏజెంట్‌గా నియమించటం నిబంధనలకు విరుద్ధం.

రోడ్డే చెరువై..



వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న అన్నారం–సిర్పూర్‌ రోడ్డు

డొంకేశ్వర్‌ మండలంలోని అన్నారం–సిర్పూర్‌ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షానికి భారీ గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షపు నీటికి గుంతలు ఏర్పడకపోవడంతో వాహనాలు అదుపుతప్పి కిందపడుతున్నారు. సోమవా రం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపుతప్పి గుంతలో పడ్డారు. స్థానికులు వచ్చి వారికి సాయం చేశారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని అన్నారం, సిర్పూర్‌ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– డొంకేశ్వర్‌(ఆర్మూర్‌)

రైతును కాపాడిన అధికారులు



రైతుతో రెస్క్యూ బృందం

పిట్లం(జుక్కల్‌):పిట్లం మండలం తిమ్మానగర్‌ గ్రామ శివారులో కాకి వాగు, నల్ల వాగు పొంగి పొర్లుతోంది. ఈ వరద ప్రవాహంలో చిక్కుకున్న ఫక్రియా అనే రైతును అధికారులు కాపాడారు. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని పోచారం తండాకు చెందిన ఫక్రియా పిట్లం మండలంలోని తిమ్మానగర్‌ గ్రామ శివారులో పొలం కౌలుకు తీసుకొని పత్తి, వరి సాగు చేస్తున్నాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లాడు. అదే సమయంలో పక్కనే ఉన్న కాకి వాగు, నల్ల వాగులో వరద పొంగి పొర్లడంతో ఫక్రియా చిక్కుకున్నాడు. పొలం దగ్గర ఉన్న చెట్టు ఎక్కి కూర్చున్నడు. గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన సహాయక బృందం తక్షణమే రంగంలోకి దిగి రెస్క్యూ ఆపరేషన్‌ చేపట్టారు. వరద ఉధృతి నుంచి రైతును సురక్షితంగా రక్షించి, ఒడ్డుకు చేర్చారు. అయితే, పొలం వద్ద ఉన్న ఆవు, బర్రె వరదలో మృతి చెందాయి. రెవెన్యూ, పోలీస్‌, అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

‘సాగర్‌’ ఐదు గేట్లు ఎత్తివేత



నిజాంసాగర్‌ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్‌(జుక్కల్‌): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నిజాంసాగర్‌ ప్రాజెక్టులోకి 32,820 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని ప్రాజెక్టు అధికారులు సోమవారం తెలిపారు. ఐదు గేట్లను ఎత్తి 32,820 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8టీఎంసీల) కాగా, 1405 అడుగుల(17.8 టీఎంసీల) పూర్తిస్థాయి మట్టంతో నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కౌలాస్‌లోకి 7,147 క్యూసెక్కులు..

కౌలాస్‌ ప్రాజెక్టులోకి 7,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, ఐదు గేట్ల ద్వారా 9,782 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237టీఎంసీల)కు గాను 457.85 మీటర్లు(1.201టీంసీల) నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మంజీర పరవళ్లు

సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి, కల్హేర్‌, నారాయణఖేడ్‌, సిర్గాపూర్‌ మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో నల్లవాగు మత్తడికి వరద పోటెత్తింది. నల్లవాగు మత్తడి అలుగు పైనుంచి 35 వేల క్యూసెక్కులకు పైగా నీరు పొంగిప్రవహించింది. అలాగే నిజాంసాగర్‌ ప్రాజెక్టు వరదగేట్ల ద్వారా 32 వేల క్యూసెక్కుల నీరు, కళ్యాణి ద్వారా 15 వేలు, సింగితం వాగు, నర్సపాతచెరువు వాగుల ద్వారా 10 వేల క్యూసెక్కుల నీరు మంజీరాలోకి ప్రవహించడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. మంజీరాకు ఇరువైపులా ఉన్న పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సోయాకు తీవ్ర నష్టం



మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని సోనాల, డోంగ్లీ మండలంలోని మొగా, లింబూర్‌ గ్రామ శివారులో భారీ వర్షం కురవడంతో రైతులు కోసి కుప్ప పెట్టిన సోయా పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు పేర్కొన్నారు. అలాగే కోతలు కాకుండా ఉన్న పంట అడ్డం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిస్తే వచ్చే నాలుగు గింజలు కూడా రావని అన్నదాతలు బాధపడుతున్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, పంటను సాగు చేస్తే, పంట చేతికి వచ్చే సరికి వర్షం నష్టపరిచిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని సోయా రైతులు కోరుతున్నారు.

ప్రత్యేక రైలులో తీర్థయాత్ర



ఖలీల్‌వాడి: భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు ప్రజలకు అవకాశం కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థయాత్రలకు ప్రత్యేక పర్యాటక రైలు (భారత్‌ గౌరవ్‌)ను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఈ యాత్ర అక్టోబర్‌ 7 నుంచి 16 వరకు ఉంటుందని, ద్వారకాదీష్‌ మందిరము, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరము, భేట్‌ ద్వారక, సోమనాథ్‌ జ్యోతిర్లింగ మందిరము, సబర్మతి ఆశ్రమం, సూర్యదేవాలయం, రాణికి వావ్‌, స్టాచ్యూ ఆఫ్‌ యూనిటీ (సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ విగ్రహం) దర్శించుకోవచ్చునని తెలిపారు. ప్రయాణికులకు ఒక్కొక్కరికి సాధారణ టికెట్‌ ధర రూ.18,400, త్రీ ఏసీ రూ. 30,200, టూ ఏసీ రూ.39,900 చెల్లించాలని పేర్కొన్నారు. ప్యాకేజీలో మూడు పూటల భోజన వసతి, రవాణా సౌకర్యాలు, ప్రతి కోచ్‌లో ఐఆర్‌సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సౌత్‌ సెంట్రల్‌ జోన్‌ ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్‌ జనరల్‌ మేనేజర్‌ డీఎస్‌జీపీ కిశోర్‌ తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఐఆర్‌సీటీసీ 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9701360701, 9281030711, 9281030749, 9281495845, 9281495843 నంబర్లకు లేదా www. irctctourism. com వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



అపూర్వ సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్‌

వేల్పూర్‌: వేల్పూర్‌ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994–95 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 30 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకొని స్కూల్‌ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సంజీవ్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్‌, సుదర్శన్‌, విశ్వనాథం, మురళీధర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

తైక్వాండోలో బంగారు పతకం



నిజామాబాద్‌నాగారం: మొదటి ఏషియన్‌ ఓపెన్‌ అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌ టోర్నీలో జిల్లాకు చెందిన ఎమ్‌ మాధురి బంగారం పతకం సాధించారు. సెప్టెంబర్‌ 12 నుంచి 14వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ టోర్నీ జరిగింది. నగరంలోని కసాబ్‌గల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాధురి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించారు. మాధురిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయారెడ్డి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: ఖైసర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అథ్లెటిక్స్‌ ఫెస్టివల్‌ కరపత్రాలను సోమవారం రాష్ట్ర మైనారిటీ కమిషన్‌ చైర్మన్‌ తారిక్‌ అన్సారీ ఆవిష్కరించారు. జిల్లాలో ప్రతి ఏడాది నవంబర్‌ 8న స్వాతంత్య్ర సమరయోధుడు, మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌ కలాం ఆజాద్‌ జయంతిని పురస్కరించుకొని టోర్నీ నిర్వహించనున్నారు. టోర్నీలో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఖైసర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ చైర్మన్‌ సయ్యద్‌ఖైసర్‌ పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

మాక్లూర్‌: మండలంలో సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గుర్తించే పనిలో ఉండాలని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి మాక్లూర్‌ ఎస్సై రాజశేఖర్‌కు సూచించారు. సోమవారం రాత్రి మాక్లూర్‌ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఉంటుందన్నారు. అందుకు ఇప్పటి నుంచే పోలింగ్‌ సమయంలో ఏ గ్రామాలు సమస్యాత్మకంగా ఉంటాయనేది ఆరా తీయాలన్నారు. అలాంటి పోలింగ్‌ కేంద్రాల్లో కచ్చితంగా కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ పోలీసులు ఇప్పటి నుంచే ఎన్నికల ప్రక్రియపై నిఘా ఉంచాలన్నారు. మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట నార్త్‌ జోన్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై–1 రాజశేఖర్‌, మొగులయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

లాడ్జీలపై పోలీసుల దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఉన్న 20 లాడ్జీలపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. వ్యభిచారం జరుగుతుందనే సమాచారం మేరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు లాడ్జీలను తనిఖీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. రైల్వేస్టేషన్‌ సమీపంలోని లక్ష్మి లాడ్జీలో ఒక విటుడు, విటురాలిని గుర్తించి విచారించామన్నారు. విటుడిని మోస్రా మండలం చింతకుంటకు చెందిన అజీజ్‌గా గుర్తించినట్లు తెలిపారు. లాడ్జి మేనేజర్‌ కేదర్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు. తనిఖీలో ఎస్సైలు, 25 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఒడిశా టు నిజామాబాద్‌

- 7.700 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- ఇద్దరి రిమాండ్‌

ఖలీల్‌వాడి: ఒడిశా నుంచి నిజామాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తున్న బాలుడితోపాటు ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఈఎస్‌ విలాస్‌ సోమవారం తెలిపారు. నగరంలో ఎండు గంజాయిని విక్రయించేందుకు వచ్చిన ఒడిశాకు చెందిన బాలుడితోపాటు సిరికొండకు చెందిన వోలం వంశీ, తర్రి తరుణ్‌లను పట్టుకున్నామన్నారు. నిందితుల నుంచి 7.700 కిలోల ఎండుగంజాయి, రెండు సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒడిశాలో ఎండు గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి నిజామాబాద్‌ నగరంలో ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చనే ఉద్దేశంతోనే తెచ్చారని వివరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎక్సైజ్‌ సీఐ వెంకటేశ్‌, ఎస్సై రాంకుమార్‌ తదితరులు ఉన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బృందం

అహ్మదీపురా కాలనీలో చోరీ

- రూ.7 లక్షల నగదు అపహరణ

ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీపురా కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. అహ్మదీపురా కాలనీకి చెందిన సాబేర్‌ సెప్టెంబర్‌ 30న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం హైదరాబాద్‌ నుంచి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని రూ. 7 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణకు గురైందని బాధితుడు రెండో టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై సయ్యద్‌ ముజాహిద్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

తాళం వేసిన ఇంట్లో..



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బైక్‌ మెకానిక్‌ బాలు ఆదివారం ఇంటికి తాళం వేసి బీర్మల్‌ తండాలో ఉన్న బంధువుల వద్దకు కుటుంబసభ్యులతో వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో దాచిన తులం బంగారు నగలు, 60 తులాల వెండితోపాటు కొంత నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య కాపురానికి రావడం లేదని ఒకరు, జీవితంపై విరక్తితో మరొకరు, అనారోగ్య కారణంతో ఇంకొకరు బలవన్మరణం చెందారు.

భార్య కాపురానికి రావడం లేదని..



గోర్కంటి స్వామి (ఫైల్‌)

భిక్కనూరు: బీబీపేట మండలం కోనాపూర్‌ గ్రామానికి చెందిన గోర్కంటి స్వామి (26)కి మల్లుపల్లి గ్రామానికి చెందిన శిరీషతో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. ఏడాది క్రితం ఇద్దరి మధ్య తగాదాలు కావడంతో శిరీష తల్లిగారింటి వద్దే ఉంటోంది. అప్పటి నుంచి స్వామి తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. సోమవారం వేకువజామున భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి వచ్చిన స్వామి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అనారోగ్యంతో..



సాయితేజ మృతదేహం

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన చల్ల సాయితేజ(23) రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. అతను ఫిట్స్‌తో బాధపడేవాడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు వివరించారు.

జీవితంపై విరక్తితో..

రెంజల్‌(బోధన్‌): రెంజల్‌ మండల కేంద్రానికి చెందిన సింగ సాయిలు(41) జీవితంపై విరక్తి చెంది సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. మార్చి నెలలో అతని భార్య మృతి చెందడంతో మానసికంగా వేదనకు గురైన సాయిలు అద్దె ఇంట్లో ఉన్న గిరకబావిలో పడి బలవన్మరణం చెందినట్లు వివరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

ప్రయివేటు బస్సు బోల్తా

- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



బోల్తా పడిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: కోతకు గురైన రోడ్డు కారణంగా ఓ ప్రయివేటు బస్సు బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దాదాపు 30 మంది ప్రయాణికులతో నాగ్‌పూర్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న ఓ ప్రయివేటు బస్సు సిరిసిల్లా రోడ్‌ ప్రాంతంలోకి రాగానే జాతీయ రహదారిపై అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పట్టణంలోని జనరల్‌ ఆస్పత్రికి తరలించారు. కాగా, బస్సు అదుపుతప్పిన ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. మరమ్మతు పనులు పకడ్బందీగా చేపట్టకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సు వేగం తక్కువగా ఉండడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు



జైలు శిక్ష పడిన డ్రంకెన్‌ డ్రైవ్‌ నిందితులు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన ఐదుగురికి కామారెడ్డి కోర్టు ఒక రోజు జైలు శిక్ష, జరిమానా విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షల్లో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. సోమవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్‌ ఒక రోజు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

SERVICES

CHANGE OF NAME

PUPPALA RAJESHWARI D/o PUPPALA RAJU R/o H.No.3-26/1 Chinthaloor(V), Jakranpally(M), Nzb(D) have changed my name as PUPPALA HINAYARAJ D/o PUPPALA RAJU.
[SCA25008733]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
Contact: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్‌ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.